క్లుప్తంగా

దారి మళ్లింపు

భైంసారూరల్: మండలంలోని దేగాం గ్రామంలో భైంసా–నిజామాబాద్ ప్రధాన రహదారి మార్గం మళ్లించనున్నట్లు ఆర్‌అండ్‌బీ ఏఈ రఘు తెలిపారు. ప్రధాన రహదారి డబుల్‌లైన్ పనుల కోసం రూ.80 లక్షలు మంజూరయ్యాయని.. సోమవారం నుంచి పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. భైంసా–నిజామాబాద్, భైంసా–హైదరాబాద్ వెళ్లే వాహన చోదకులు గమనించి భైంసా–నిర్మల్, భైంసా–కల్లూర్ ఎక్స్‌రోడ్డు, లోకేశ్వరం మీదుగా వెళ్లాలని కోరారు.

భీమన్న దేవుడి పండుగ



నగర్‌లో పూజలు చేస్తున్న భక్తులు

లోకేశ్వరం: మండలంలోని రాజూర, నగర్ గ్రామాల్లో ఆదివారం భీమన్న దేవుడి పండుగ నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు గ్రామస్తులు భీమన్న దేవుళ్ల ప్రతిమలను ప్రధాన వీధుల గుండా ఊరేగించి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో భీమన్న సంఘం సభ్యులు పాల్గొన్నారు.

తాగి నడిపితే కఠిన చర్యలు

లోకేశ్వరం: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై సాయికుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని మన్మద్ గ్రామ సమీపంలోని క్రాస్‌రోడ్డుపై వాహనాలు తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా వాడాలన్నారు. వారి వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

మహాపోచమ్మ ఆలయంలో పూజలు



ఆలయం వద్ద భక్తుల సందడి

లక్ష్మణచాంద: మండలంలోని ధర్మారం గ్రామంలో మహాపోచమ్మ ఆలయం వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి.

ఆలయాల్లో హోమం



ఆలయంలో హోమం నిర్వహిస్తున్న భక్తులు

మామడ: మండలంలోని న్యూలింగంపల్లిలో నూతనంగా నిర్మించిన శివాలయం, హనుమాన్ ఆలయాల్లో ఆదివారం హోమం నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ హోమం, అగ్నిహోత్రి, తీర్థప్రసాదం వంటి ప్రత్యేక కార్యక్రమాలు జరిపించారు. సోమవారం విగ్రహ ప్రతిష్ఠాపన ఉంటుందని.. ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగాధర్ దంపతులు పాల్గొన్నారు.

గ్రామదేవతలకు పూజలు

లోకేశ్వరం: మండలంలోని రాయపూర్‌కాండ్లీలో ఆదివారం గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు ఊరేగింపుగా వెళ్లి గోదావరి జలంతో ప్రతిమలకు అభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గజ్వేరి పోసాని, గ్రామస్తులు గంగాధర్, సుదర్శన్‌రెడ్డి, రమేశ్, నర్సారెడ్డి, దేవేందర్, నర్సయ్య పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతో వృథాగా తాగునీరు



చౌరస్తాలో వృథాగా పోతున్న నీరు

ఖానాపూర్: పట్టణంలోని నిర్మల్–ఖానాపూర్ ప్రధాన రహదారిపై పైపులైన్ లీకేజీల పర్వం సాగుతోంది. మిషన్ భగీరథ, మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆదివారం పట్టణంలోని జగన్నాథ్‌రావు చౌరస్తాలో సుమారు గంటపాటు తాగునీరు వరదలా పారడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. లీకేజీల కారణంగా తాగునీరు వృథాకావడంతో పాటు కలుషితమై ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. భగీరథ అధికారుల తీరుపై పట్టణంలోని కౌన్సిలర్లంతా పలుమార్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



పగిలిన కిటికీలు, తాగి పడేసిన బీర్‌సీసా



ఇళ్లలో పగిలిన కిటికీల ముక్కలు



డబుల్ ఇళ్ల మధ్య ప్రమాదకరంగా గుంత

సీఎం సారొస్తుండు.. సౌకర్యాలు కల్పించరా?



డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో మసక బారిన గోడలు

జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న మంత్రి ఐకేరెడ్డి స్వగ్రామం ఎల్లపెల్లిలో మూడేళ్ల కిందట సుమారు 1100 వరకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించారు. వీటిని పలువురికి కేటాయించారు.. కానీ పంపిణీ చేయలేదు. లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరగడంతో ఇళ్లల్లో కిటికీలు పగిలిపోయి.. గోడలు మసకబారాయి. రాత్రి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయని పలువురు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వచ్చే నెల 4న కలెక్టరేట్‌తోపాటు డబుల్ ఇళ్లను ప్రారంభించేందుకు సీఎం కేసీఆర్ వస్తున్నా.. అధికారులు మాత్రం ఇక్కడ తాగునీరు, విద్యుత్, రోడ్డు వంటి కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయలేదు. అధికారులు స్పందించి వసతులు కల్పించాలని లబ్ధిదారులు వేడుకుంటున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

నేడు మంత్రి పర్యటన

మామడ: మండలంలోని కమల్‌కోట్, న్యూలింగంపల్లి గ్రామాల్లో సోమవారం మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పర్యటించనున్నట్లు బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు కమల్‌కోట్ విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణానికి భూమిపూజ, 11 గంటలకు న్యూలింగంపల్లిలో శివాలయం, హనుమాన్ ఆలయాల్లో విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొంటారని పేర్కొన్నారు.

నేడు నిర్మల్ మండల సర్వసభ్య సమావేశం

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని మండల పరిషత్తు కార్యాలయంలో సోమవారం నిర్మల్ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సాయిరాం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ కోరిపల్లి రామేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన ఉదయం 11:30 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని వారు కోరారు.

మంత్రికి ఆహ్వానం

కుంటాల: మండలంలోని లింబా(కే) గ్రామంలో నూతనంగా నిర్మించిన తూర్పుముఖి ఆంజనేయస్వామి ఆలయాన్ని జూన్ 12న ప్రారంభించనున్నారు. ఈమేరకు గ్రామస్తులు ఆదివారం నిర్మల్‌లో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని కలిసి ఆహ్వాన పత్రిక అందించి ప్రారంభోత్సవానికి రావాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ మోరె ఆనంద్‌రావుపటేల్, ఆత్మ చైర్మన్ సవ్య అశోక్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ గోనె గజ్జారాం తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన విజయవంతం చేయాలి

- ఎమ్మెల్యే రేఖానాయక్



కడెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేఖానాయక్

ఖానాపూర్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వచ్చే నెల 4న నిర్మల్‌లో సీఎం కేసీఆర్ కలెక్టరేట్ ప్రారంభిస్తారని.. వారి పర్యటన విజయవంతం చేయాలని ఎమ్మెల్యే రేఖానాయక్ కార్యకర్తలకు సూచించారు. పట్టణంలోని తన నివాసంలో ఎమ్మెల్యే బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, గ్రామాల ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో మాట్లాడారు. పుప్పాల శంకర్, రామునాయక్, రాజేందర్, రాజగంగన్న, శ్రీనివాస్, రాజేశ్వర్, గజేందర్, సురేశ్ ఉన్నారు.

బీఆర్‌ఎస్ సన్నాహక సమావేశం

కడెం: వచ్చే నెల 4న నిర్మల్‌లో జరిగే సీఎం కేసీఆర్ పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని హరిత రిసార్ట్స్‌లో ఎమ్మెల్యే రేఖానాయక్.. మండల నాయకులతో నిర్వహించిన బీఆర్‌ఎస్ సన్నాహక సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పెద్దూర్ నుంచి కొండుకూర్ వరకు రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు, మండలంలో పాలిటెక్నిక్ కళాశాల, నచ్చన్‌ఎల్లాపూర్ గురుకుల కళాశాలను డిగ్రీ కళాశాలగా అప్‌గ్రేడ్, బెల్లాల్–ఖానాపూర్ బీటీ రోడ్డు.. డబుల్ రోడ్డుగా మార్చాలని, కడెం ప్రాజెక్టుకు పూర్తిస్థాయి మరమ్మతులు, సిబ్బంది నియామకం తదితర ప్రతిపాదనలను సీఎం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు జొన్నల చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ శ్యాంసుందర్, రైతుబంధు సమితి మండల కన్వీనర్ జీవన్‌రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ సతీశ్, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు వేణుగోపాల్, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు రఫీక్ అహ్మద్, ఏఎంసీ డైరెక్టర్ మంగ తదితరులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ..

దస్తురాబాద్: మండల కేంద్రంలోని రైతువేదికలో మండలంలోని దేవునిగూడెం, మున్యాల తండా, మున్యాల, రేవోజీపేట, బుట్టాపూర్ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఆదివారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే రేఖానాయక్ అందజేశారు. అనంతరం కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సీఎం పర్యటనకు కార్యకర్తలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ సింగరి కిషన్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు ఐలయ్యయాదవ్, సంతోశ్, సత్యం, రాజు, గంగన్న, లక్ష్మీరాజం, అజయ్, సురేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వాహనపత్రాలు వెంట ఉంచుకోవాలి

- ముథోల్ సీఐ వినోద్‌రెడ్డి
- మచ్కల్‌లో కార్డన్ సెర్చ్



స్వాధీనం చేసుకున్న వాహనాల వద్ద పోలీసులు

ముథోల్: వాహనదారులు ఎల్లప్పుడు ధ్రువీకరణ పత్రాలను వెంట ఉంచుకోవాలని ముథోల్ సీఐ వినోద్‌రెడ్డి అన్నారు. మండలంలోని మచ్కల్ గ్రామంలో ఆదివారం కార్డన్‌సెర్చ్(కమ్యూనిటీ కాంటాక్ట్) నిర్వహించారు. ఈసందర్భంగా పోలీసులు ఉదయం గ్రామాన్ని ఆధీనంలోకి తీసుకొని తనిఖీలు నిర్వహించారు. సరైన పత్రాల్లేని 55 ద్విచక్రవాహనాలు, ఏడు ఫోర్‌వీల్లర్లు, ఐదు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ మాట్లాడారు. శాంతి భద్రతల రక్షణ కోసమే కార్డన్‌సెర్చ్ నిర్వహిస్తున్నామని.. గ్రామస్తులు ఐక్యంగా ఉంటూ పోలీసులకు సహకరించాలని కోరారు. సెకండ్‌హ్యాండ్ వాహనాలు కొనేటప్పుడు అన్ని పత్రాలు చూసుకోవాలని సూచించారు. ఎస్సైలు సాయికిరణ్, మహేశ్, విక్రమ్, సాయికుమార్, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

బాసరలో ఈదురుగాలుల వర్షం



బాసరలో జలమయమైన రోడ్లు



అందకూర్‌లో తడిసిన ధాన్యం

భైంసా: బాసరలో ఆదివారం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ప్రధానరోడ్లు జలమయమయ్యాయి. దాదాపు గంటపాటు ఏకధాటిగా వర్షం కురువడంతో చిరువ్యాపారులు, పలువురు భక్తులు ఇబ్బంది పడ్డారు.

కుంటాల మండలంలో స్వల్ప వర్షం..

కుంటాల : మండలంలోని అందకూర్, ఓలా, వెంకూర్ కుంటాల, అంబకంటి గ్రామాల్లో ఆదివారం సాయంత్రం తేలికపాటి వర్షం కురిసింది. కల్లాల్లో ఉన్న మొక్కజొన్న, వరిధాన్యం తడవకుండా రైతులు ముందస్తుగా టార్పాలిన్లు కప్పి ఉంచారు. అందకూర్‌లో రోడ్డుపై ఆరబోసిన ధాన్యం తడిసింది.

‘బీసీల సంక్షేమం విస్మరించిన బీఆర్‌ఎస్’



నర్సాగౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు



మార్నింగ్ వాక్‌లో మాట్లాడుతున్న మహేశ్వర్ రెడ్డి

సారంగపూర్: తెలంగాణలో బీసీల సంక్షేమాన్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వం విస్మరించిందని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి అమరవేణి నర్సాగౌడ్ అన్నారు. సోమవారం సారంగపూర్‌లో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. అనంతరం నర్సాగౌడ్‌ను సన్మానించారు. సాగర్, మల్లేశ్, సత్యనారాయణ, తిరుమలచారి, చాణక్య, తేజు, వెంకటేశ్, రాజేశ్వర్, లక్ష్మణ్, రంజిత్, శ్రీనివాస్, వీరయ్య, గణపతి, వినోద్ పాల్గొన్నారు.

ముథోల్: పల్లెపల్లెకు బీజేపీ–గడపగడపకు మోహన్‌రావుపటేల్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆ పార్టీ నాయకులు మండలంలోని చించాల, తరోడా, తరోడాతండా గ్రామాల్లో పర్యటించారు. ప్రతి గడపకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. వారి వెంట మాజీ ఎంపీపీ సుభాశ్ జాదవ్, లక్ష్మణ్, భీమేందర్, సర్వేశ్, సందీప్ తదితరులు ఉన్నారు.

‘వచ్చేది బీజేపీ ప్రభుత్వమే’

లక్ష్మణచాంద: వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు అవుతుందని ఆ పార్టీ మండలాధ్యక్షుడు గోవర్ధన్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఓ ఫంక్షన్‌హాలులో బీజేపీ మండల ముఖ్య నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. త్వరలో ఎన్నికలు రానున్నందున కార్యకర్తలు ఇప్పటి నుంచే కలిసికట్టుగా పని చేయాలన్నారు. ఇంటింటికీ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. పార్టీ మండల ఉపాధ్యక్షులు రంజిత్, వెంకట్‌రెడ్డి, ముత్యంరెడ్డి, భరత్, నారాయణ, మోహన్, ముత్తన్న, రవికుమార్, రాజారెడ్డి, సాయన్న, రఘు, గంగాధర్ పాల్గొన్నారు.

స్థానిక సమస్యలపై ఆరా

నిర్మల్‌చైన్‌గేట్: ఇటీవల బీజేపీలో చేరిన నిర్మల్ మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి క్షేత్రస్థాయిలోకి వెళ్లి స్థానిక సమస్యలు తెలుసుకుంటున్నారు. ఆదివారం ఉదయం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఉదయం వాకింగ్ చేస్తున్న పలువురిని కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. వారి వెంట బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి అమరవేణి నర్సాగౌడ్, అయ్యన్నగారి భూమయ్య, అంజుకుమార్‌రెడ్డి, డి.ముత్యంరెడ్డి, నారాయణరెడ్డి, కరిపె విలాస్, అర్జున్, గంగన్న, భూపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ బోనాలు



బోనాలతో వెళ్తున్న మహిళలు

ఖానాపూర్: మండలంలోని దిలావర్‌పూర్ రేణుక ఎల్లమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం పోచమ్మ బోనాల పండుగ నిర్వహించారు. ఈసందర్భంగా గౌడశెట్టి పూజారుల ఆధ్వర్యంలో గ్రామంలో డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపు నిర్వహించారు. పోతరాజుల విన్యాసాలు ఆకర్షణగా నిలిచాయి. పలు చోట్ల పోచమ్మ పట్నాలు వేసి పూజలు చేశారు. అనంతరం ఎల్లమ్మ ఆలయానికి వెళ్లి బోనాలతో నైవేద్యం సమర్పించారు.

మంజులాపూర్‌లో అ‘పూర్వ’ సమ్మేళనం



గురువులతో విద్యార్థులు

నిర్మల్‌రూరల్: మండలంలోని మంజులాపూర్ జెడ్పీఎస్‌ఎస్‌లో 2003–04 విద్యాసంవత్సరంలో పదోతరగతి చదివినవారు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిన్ననాటి మిత్రులంతా అంతా ఒకచోట చేరి సందడిగా గడిపారు. ఒకరికొకరు యోగక్షేమాలు తెలుసుకొని విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.

40వరోజుకు చేరిన వీవోఏల సమ్మె

ఖానాపూర్: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ముందు ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్ మండలాల వీవోఏలు చేపట్టిన సమ్మె ఆదివారం 40వ రోజుకు చేరింది. వారు మాట్లాడుతూ ప్రభుత్వం కనీస వేతనం నెలకు రూ.26వేలు చెల్లించడంతో పాటు తమను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీవోఏలు పి.లావణ్య, జి.లావణ్య, విజయ, గంగారాం, జ్యోతిరాం, రవీందర్, మమత, సుజాత, భారతమ్మ, లక్ష్మి, గంగామణి తదితరులు ఉన్నారు.

ఎస్సైకి సన్మానం

నర్సాపూర్(జి): ఇటీవల బాధ్యతలు స్వీకరించిన మండల ఎస్సై రవీందర్‌ను ఆదివారం కాంగ్రెస్ నాయకులు కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు కటకం భూమారెడ్డి, నారాయణ్‌రెడ్డి, దత్తురాం, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్ ఆదమరిస్తే.. అంతే



లోకేశ్వరం: మండలంలోని రాజుర నుంచి గడ్‌చాంద్ గ్రామానికి వెళ్లే మార్గంలో ఉన్న గోవింద్ చెరువుకట్ట కోతకు గురై ప్రమాదకరంగా మారింది. భారీ వర్షాలు కురిస్తే చెరువు నిండి కట్ట తెగే ప్రమాదం ఉంది. ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు చెరువు కట్టకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: శ్రీకాంత్, ఇరిగేషన్ ఏఈ, లోకేశ్వరం, ఫోన్: 95504 82312

ముందుగానే ఎన్నికల సందడి



కడెం: ఖానాపూర్ నియోజకవర్గంలో ముందుగానే ఎన్నికల వాతావరణం కనిపిస్తుంది. బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు నాయకులు నిత్యం గ్రామాల్లో తిరుగుతూ ప్రజలను కలిసి సమస్యలు తెలుసుకుంటున్నారు. మరోవైపు పోస్టర్లు, ఫ్లెక్సీలు సైతం వెలిశాయి. దీంతో ఎన్నికలు ముందుగానే వచ్చాయని జనం చర్చించుకుంటున్నారు.

విద్యుత్ స్తంభాలు ఏర్పాటు

ముథోల్: మండల కేంద్రంలో సామాజిక ఆసుపత్రి నుంచి పురాతన శివాలయం వరకు పంచాయతీ ఆధ్వర్యంలో వీధిదీపాలను ఏర్పాటు కోసం స్తంభాలు అమర్చే పనులు చేపట్టినట్లు సర్పంచ్ రాజేందర్ తెలిపారు. పారిశుద్ధ్య పనులు నిర్వహించి.. నీటి సమస్య రాకుండా చూస్తున్నట్లు పేర్కొన్నారు.

సన్మానం

కుంటాల: మండలంలోని లింబా(కే)కు చెందిన ఎండీ కలీం జంతుశాస్త్ర విభాగంలో డాక్టరేట్ పొందారు. ప్రభుత్వం లింబా(బి)కే చెందిన జూనియర్ లెక్చరర్ మహేందర్‌ను రెగ్యులరైజ్ చేసింది. కాగా ఆదివారం గ్రామంలో 1997–98లో పదోతరగతి చదివిన విద్యార్థులు వారిని సన్మానించారు.

తూముకు మరమ్మతులు చేపట్టండి



గత వర్షాలకు తూము వద్ద పడిన బుంగ

నర్సాపూర్(జి): మండలంలోని గొల్లమాడ గ్రామ పెద్దచెరువు వానాకాలంలో వెయ్యి ఎకరాలకు, యాసంగిలో 700 ఎకరాలకు సాగునీరు అందిస్తుందని ఆయకట్టు రైతులు పేర్కొంటున్నారు. గత వర్షాలకు చెరువు తూము వద్ద పెద్ద బుంగ పడి ప్రమాదకరంగా మారింది. దీంతో తూము వద్ద నిర్మించిన రాతి బండలు బీటలు వారాయి. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని.. లేకుంటే వర్షాకాలంలో చెరువు కట్టకు గండి పడి నీరు వృథాగా పోతుందని ఆయకట్టు రైతులు పేర్కొంటున్నారు.